
చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, మేయర్

అనుక్షణం.. బల్దియా అప్రమత్తం..

- 22 చెరువుల వద్ద 832 మంది సిబ్బంది విధులు
- పర్యవేక్షించిన కమిషనర్, మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 16: గ్రేటర్ వరంగల్ నగరం తో పాటు విలీన గ్రామాలలో సోమవారం జరిగిన నిమజ్జనో త్సవంలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అప్రమత్తంగా ఉంటూ విజయవంతంగా పూర్తి చేసింది. గణనాథులకు నిమజ్జనం కోసం నగరంలోని 22 చెరువుల వద్ద బల్దియా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. పెద్దఎత్తున శోభ యాత్రలు నిర్వహిస్తుండగా వారికి బల్దియా ఆధ్వ ర్యంలో విధులు నిర్వర్తించే సిబ్బంది సహకరించారు. గణపతులను మండపాల నుంచి తరలించిన వెంటనే అక్కడి మిగిలిపోయిన పూలు, చెత్తను శాని టేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సేకరించి అక్కడి నుంచి బాలసముద్రంలోని ట్రాన్స్ ఫర్ స్టేషన్‌కు తరలించారు. నిమ జ్జనం చేసే సమయంలో చెరువుల వద్ద బల్దియా శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. ఒక్కో

మిగతా 8వ పేజీలో..

భారీగా పోలీసు బందోబస్తు

- విధుల్లో 2,500 మంది పోలీసులు
- 135 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా
- నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన సీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 16: నవరాత్రి ఉత్సవాలు ముగించుకుని సోమవారం నిర్వహించిన వినాయక నిమజ్జనానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ట్రైసిటీస్ (వరంగల్, హనుమకొండ, కాజీపేట) పరిధిలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు 2,500 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రెయినీ పోలీసులను సైతం బందోబస్తుకు ఉపయోగించారు. నగరంలో 23 చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు చేయగా ప్రధానంగా

మిగతా 8వ పేజీలో..


చిన్నవడ్డెపల్లి చెరువులో వినాయకుడి నిమజ్జనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద


చిన్నవడ్డెపల్లి చెరువులో వినాయకుడి నిమజ్జనం

బై.. బై.. గణేశా..

- కన్నుల పండువగా గణపతి నిమజ్జనోత్సవం
- అంబరాన్నంటిన శోభాయాత్ర సంబరాలు
- జిల్లా కేంద్రంలోని చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జనం
- పకడ్బందీ ఏర్పాట్లు.. ఊపిరి పీల్చుకున్న పోలీసులు

వరంగల్ సిటీ/పోచమ్మమైదాన్, సెప్టెంబరు 16 : భక్తుల తన్మయత్వం, చిన్నారుల జయ జయ ధ్వానాలతో గణేష్ నిమజ్జనోత్సవం సోమవారం జిల్లా వ్యాప్తంగా కన్నుల పండువగా జరిగింది. నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడిని నృత్యాలు, కోలాటాలు, డప్పుచప్పుళ్ల మధ్య శోభాయాత్రతో తరలించి గంగమ్మ ఒడికి సాగనంపారు. గణపతి బొప్పా మోరియా... అంటూ భక్తులు హోరెత్తిన నినాదాలతో ఉండ్రాల య్యకు ఘనమైన వీడ్కోలు పలికారు. వరంగల్ నగరం దేశాయిపేట రోడ్‌లోని చిన్నవడ్డెపల్లి చెరువులో సోమ వారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వ హించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి, భారీ క్రేన్‌లతో నిమజ్జన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ నవరాత్రులు భక్తితో గణేషు న్ని కొలిచి నిమజ్జనం చేసుకుంటున్నామని, భగవం తుడి ఆశీర్వాదం ప్రజలపై ఉంటుందని అన్నారు. జిల్లాలో వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, భారీ బందోబస్తు నడుమ నిమజ్జన వేడుకలు జరుగుతు న్నాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో తహసీలార్ మహ్మద్ ఇక్బాల్, పెరుమాళ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నవడ్డెపల్లి చెరువులో వినాయక నిమజ్జనం ఉదయం నుంచే కోలాహలంగా సాగింది. పలు ప్రాం తాల నుంచి భక్తులు తరలివచ్చి ఉత్సాహంగా విగ్రహా లను చెరువులో నిమజ్జనం చేశారు. సాయంత్రం వేళ నుంచి నిమజ్జన వేడుకలు జోరందుకున్నాయి. గత ఏడాది 3,500 వినాయకులను నిమజ్జనం చేయగా, ఈ ఏడాది 4వేల విగ్రహాల వరకు నిమజ్జనం చేసే అవ కాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అయితే చిన్నవడ్డెపల్లి చెరువుకు సమీపంలో ఉండే కోట చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయ డాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధించడంతో చిన్న వడ్డెపల్లి చెరువుకు తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో సుమారు 6వేల విగ్రహాల వరకు నిమ జ్జనం చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అలాగే ఉర్సు రంగసముద్రం, శివనగర్ అగర్తా ల చెరువు, శంభునిపేట బెస్తం చెరువులో వినాయక నిమజ్జనానికి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. బల్దియా ఆధ్వర్యంలో రోడ్ల మరమ్మతు, తాగు నీటి సరఫరా, లైటింగ్, పారిశుధ్య పనులు చేపట్టారు. గణపతి శోభాయాత్రలను, నిమజ్జన ప్రక్రియను పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు. చెరువుల వద్ద బారికేడ్లు, తెప్పలు, క్రేన్లు, టెంట్లు, కుర్చీలు, గజ ఈత గాళ్లను సిద్ధంగా ఉంచారు. 108 సేవలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు, బందోబస్తు నిర్వహించారు. కాగా, గత ఏడాది 20 శాతం మట్టి వినాయకులను ప్రతిష్ఠించగా ఈసారి 40 శాతానికి పెరిగినట్లు అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన మేయర్, కమిషనర్

దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జన వేడుకలను కలెక్టర్ సత్యశారదతో కలిసి గ్రేటర్ వరంగ ల్ మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్వినీతానాజీ వాకడే పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు

మిగతా 8వ పేజీలో..




చిన్నవడ్డెపల్లి చెరువులో భారీ క్రేన్లతో వినాయకులను నిమజ్జనం చేస్తున్న భక్తులు


నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు


నార్లవాయి క్రాస్ రోడ్డును సందర్శించిన ఎమ్మెల్యే రేవూరి

ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోరా..

- అధికారులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు
- రోడ్డు పనులు ప్రారంభించక పోవడంపై ఎమ్మెల్యే రేవూరి ఆగ్రహం

సంగెం, సెప్టెంబరు 16: ప్రజలు ఇబ్బందులు పడుతుం టే అధికారులు చోద్యం చూడడంపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మం డలంలో కురిసిన భారీ వర్షాలకు నార్లవాయి క్రాస్‌రోడ్డు వరదలకు కొట్టుకపోవడంతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఈనెల 2న సందర్శించి కాంట్రాక్టర్, అధికారులు కలిసి పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. 15 రోజులు అవుతున్నప్పటికి రోడ్డు మరమ్మతు పనులు చేప ట్టకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బం దులపై దిన పత్రికల్లో వస్తున్న కథనాలకు స్పందించిన ఎ మ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సోమవారం రోడ్డును సంద ర్శించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పనితీరును మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రాంత ప్రజలతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను ఫోన్‌లో నిలదీశారు. రెండు రోజుల క్రితం మొండ్రాయికి చెందిన రైతు ఎడ్లబండి నీటిలో మునిగిపోయి ఎద్దులు బతికి బయటపడిన విషయాన్ని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు రమేష్, జనగాం రమేష్, కందకట్ల నరహరి, కేశవులు, నర్సింహనాయక్, మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- జాతీయ జెండా ఆవిష్కరించనున్న మంత్రి పొంగులేటి
- కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

గిర్మాజిపేట, సెప్టెంబరు 16: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు వరంగల్ ఓసిటీ ఎదురుగా నిర్మిస్తున్న జిల్లా కలెక్టరేట్ గ్రౌండ్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ముందుగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఖిలా వరంగల్‌లోని అమరుల స్థూపం వద్ద అమరులకు నివాళులర్పించి కలెక్టరేట్ గ్రౌండ్‌లో జాతీయ పతాకం ఎగురవేస్తారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న మంత్రి పొంగులేటి 8.45 గంటలకు కాజీపేటలోని ఎన్‌ఐటీ అతిథి గృహానికి చేరుకుంటారు. ఖిలా వరంగల్ అమరవీరుల స్థూపం వద్దకు ఉదయం 9.38 గంటలకు చేరుకుని అమరవీరులకు నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి వరంగల్ జిల్లా కలెక్టరేట్ నిర్మాణ గ్రౌండ్‌కు 9.58 గంటలకు చేరుకుంటారు. అనంతరం 10 గంటలకు మంత్రి జాతీయ పతాకాన్ని ఎగురవేసి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంపై ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారు. ఉదయం 10 నుంచి 10.58 గంటల వరకు సాగే ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు, మేయర్, కలెక్టర్ తదితర జిల్లా అధికారులు పాల్గొంటారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సెప్టెంబరు 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మంత్రులు జాతీయ జెండాలను ఎగుర వేయనున్నారు.


కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

జిల్లా పాలనా యంత్రాంగం సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నిర్మాణ స్థలంలో ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. సభావేదిక, సీటింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఖిలావరంగల్ అమరవీరుల స్థూపంను కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణ ప్రజాదినోత్సవం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించే ఎంజీఎం ఆస్పత్రిలో ఎస్‌డీఎఫ్ బ్లడ్‌బ్యాంక్ కౌంటర్, పీఎంఎస్‌వై ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, గ్రేటర్ బల్దియా జంక్షన్‌లను కలెక్టర్ సత్యశారద పర్యటించి ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్‌డీవో కృష్ణవేణి, తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'వందే'భారత్

- కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న రైలు
- జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, మేయర్

కాజీపేట, సెప్టెంబరు 16: నాగపూర్ - సికింద్రాబాద్ మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన వందేభారత్ రైలు సోమవారం రాత్రి కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి సోమవారం రాత్రి కాజీపేటలో జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు 1వ ప్లాట్‌ఫారంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడారు. కాజీపేట మీదుగా వందేభారత్ రైలు ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. అయితే కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు కాకపోవడం బాధాకరమన్నారు. ఎన్ని ఇబ్బందులెదురైనా డివిజన్ సాధించి తీరుతామని పేర్కొన్నారు. రైల్వే కార్మికులతో కళకళలాడే కాజీపేట జంక్షన్‌కు తిరిగి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎన్నో ఏళ్ల కల అన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ సాధనకోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.గోపాల్‌మిశ్రా, రైల్వే అధికారులు అభిషేక్‌మిశ్రా, రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, కార్మిక నాయకులు అగ్గి రవీందర్, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ సజన్‌లాల్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంజీవరావు, ఇన్‌స్పెక్టర్, వై.సుధాకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు, రైల్వే కార్మికనాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.


జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాద్

టెక్స్‌టైల్ భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

- అదనంగా రూ.5 లక్షలు, 200 గజాల స్థలమివ్వాలి
- బీజేపీ నేతలు విజయ్‌చందర్‌రెడ్డి, కాళీప్రసాద్

గీసుగొండ, సెప్టెంబరు 16: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు గతంలో ఇచ్చిన నష్ట పరిహారానికి అదనంగా ఎకరాకు రూ.5లక్షలు, 200 గజాల భూమి ఇవ్వాలని బీజేపీ నాయకులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని శాయంపేట టెక్స్‌టైల్ పార్కు పైలాన్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్కు భూసేకరణ చేసి 8 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా కొంత మంది రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం రాకపోవడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితులకు 100 గజాల భూమిని కూడా ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని సకాలంలో నెరవేర్చనందుకు నిర్వాసిత చట్టం ప్రకారం అదనంగా నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని వారు స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్కుకు వచ్చి నిర్వాసితులకు అన్ని హంగులతో మోడల్ కాలనీ నిర్మించాలని చెప్పినప్పటికి ఎటువంటి పనులు జరుగడం లేదన్నారు. పార్కులో నెలకొల్పే పరిశ్రమలలో స్థానికులను కాకుండా స్థానికేతరులకు ఉపాధి అవకాశాలు కల్పించటం సరైంది కాదన్నారు.

పార్కు కోసం భూములు ఇచ్చిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 100 గజాల భూమి, డబుల్ బెడ్‌రూం కల్పిస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులను మోసం చేసిందని విజయ్‌చందర్‌రెడ్డి, కాళీప్రసాద్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం శిక్షణ సెంటర్‌ను ఏర్పాటు చేసి స్థానికులకు శిక్షణ ఇస్తామన్న అధికారులు ఇంతవరకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్‌వోసీ ఇవ్వకపోవడం వల్లే కేంద్ర నిధులు రూ.500 కోట్లు రాకుండా పోయాయన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. భూ నిర్వాసితుల సమస్యలను తెలిపేందుకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి వద్దకు వెళితే పార్టీలు వేరంటూ మాట్లాడటం ఎంతవరకు సమంజసం అన్నారు. టెక్స్‌టైల్ పార్కుకు చేసిన భూసేకరణ ఎంత, ఎంత మందికి నష్టపరిహారం అందింది, మిగిలిన భూమి నష్టపరిహారం ఎవరి చేతుల్లోకి వెళ్లిందనేది కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చాలన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జాన్‌విక్రమ్, నాయకులు ములక ప్రసాద్, గట్టికొప్పుల రాంబాబు, కొంగర రవికుమార్, మొలుగూరి శ్రీనివాస్, కూతురు రాజు, పగడాల రాజ్‌కుమార్, బూర్గుల యుగేందర్, బాలరాజు, శ్రీనివాస్, బుట్టి కుమారస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట ఎంఈవోకు షోకాజ్ నోటీసు

- మరో ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులకూ..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16: జిల్లాలోని నర్సంపేట ఎంఈవోతో పాటు ఎమ్మార్సీలో పనిచేస్తున్న ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం డీఈవో జ్ఞానేశ్వర్ నర్సంపేటలోని ఎమ్మార్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో పాటు ఎంఈవో నిర్లక్ష్య వైఖరిని స్వయంగా గుర్తించారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తూ నిబంధనలకు విరుద్ధంగా రికార్డులను కాంట్రాక్టు ఉద్యోగి వద్ద ఉంచామని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీఈవో తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన విషయాన్ని గుర్తించిన డీఈవో వారిని ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో సమాధానం ఇవ్వాలంటూ వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



సాయుధ సంగ్రామం.. 7 విముక్తి గీతం..

- 'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా
- నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన యోధులెందరో
- నేడు తెలంగాణ విమోచన దినం



"బండెనక బండికట్టి.. పదహారు బండ్లు కట్టి
ఏ బండ్లె పోతవు కొడుకో.. నైజాం సర్కరోడా
చుట్టుముట్టు సూర్యాపేట.. నట్టనడుమ నల్లగొండ
నువుండేది హైదరాబాద్.. దాని పక్క గోలుకొండ
గోలుకొండ ఖిలా కింద.. నీ ఘోరీ కడతం కొడుకో..
నైజాము సర్కరోడా.."

అంటూ తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనపై తిరగబడ్డారు. రజాకార్లు, పోలీసులు అణిచివేసినా.. భూస్వాములు, జమిందారులు, తాబేదార్లు ఆ నిజాం రాచరికానికి బాసటగా నిలిచినా.. బానిస బంధనాల నుంచి విముక్తి కోసం.. భూమికోసం, భుక్తికోసం కొట్లాడారు. ఓ వైపు జాతీయజెండాలు.. మరో వైపు ఆయుధాలు చేత బట్టిన ఎందరో యోధులు అవిశ్రాంత పోరాటం చేశారు. వారిలో కొందరు ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు చేశారు. నాడు ఉవ్వెత్తున సాగిన విమోచన సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాత్ర కీలకం. విమోచన ఉద్యమ చరిత్రలో ఓరుగల్లు తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. ఈ పోరుబాటలో ఎందరో యోధుల గళం.. విముక్తి గీతంలా ప్రతిధ్వనించగా.. బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల తదితర గ్రామాల్లో రజాకార్లు చేసిన మారణకాండ విప్లవ స్ఫూర్తిని రగిల్చింది. చివరకు యోధులు, ప్రజల పోరాటానికి నిజాం సర్కారు తలవంచింది. 1948 సెప్టెంబరు 17న తెలంగాణకు విముక్తి లభించింది.

ఏజెన్సీలో వినూత్నం

ములుగు జిల్లా కన్నాయిగూడెంలో రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల ఏర్పాటు



గతంలో పాఠశాలను నిర్వహించింది ఈ పాకలోనే..

ఏటూరునాగారం రూరల్/కన్నాయిగూడెం, సెప్టెంబరు 16: వినూత్న ప్రయోగానికి ఏజెన్సీ నిలయమైంది. ఏళ్ల తరబడి పూరి గుడిసెలో సాగిన చదువులకు గ్రహణం వీడింది. అటవీ పల్లెలో విద్యాబోధన కోసం ఓ కంటైనర్ సిద్ధమైంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి మారుమూల అటవీ ప్రాంతంలోని బంగారుపల్లి గ్రామంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడం వల్ల కలెక్టర్ ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఈ కంటైనర్ పాఠశాలను మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించనున్నారు.

ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయానికి 18 కిలోమీటర్ల దూరంలోని కన్నాయిగూడెం మండలం మండలం కంతనపల్లి సమీప అటవీ ప్రాం తానికి ఛత్తీస్‌గఢ్ నుంచి 2000లో గొత్తికోయలు వలస వచ్చి ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభు త్వం వీరి పిల్లల చదువుల కోసం 2010లో ఇక్కడ ఓపాకలో పాఠశాల ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ దానికి శాశ్వత నిర్మాణం జరగలేదు. పక్కా భవనం నిర్మించేందుకు అటవీ శాఖ అనుమతు లను నిరాకరిస్తోంది. దీంతో గొత్తికోయ పిల్లలు ఏళ్లతరబడి అదే పాకలో అష్టాకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇక్కడ విద్యాబోధన సాగుతోంది. మొత్తం 35 మంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకుం టున్నారు.

రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల

పాఠశాల శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఇక్కడ కంటైనర్ (ప్రీఫ్యాబ్రికేటెడ్ హౌజ్)ను ఏర్పాటు చేయాలని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర్ నిర్ణయించారు. ఇందుకు రూ. 13 లక్షలు వెచ్చించారు. ఈనెల 11న పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పుడా పాఠశాల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మొత్తం ఐదు తరగతులకు 35 మంది విద్యార్థుల కోసం 12 డ్యూయెల్ డెస్కులు ఇందులో ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అనుమతుల నిరాకరణ నేపథ్యంలో రెండు నెలల క్రితం తాడ్వాయి మండలంలో మొట్టమొదటి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయగా, ఇప్పుడు అదే తరహాలో కన్నాయిగూడెం మండలం కంతనపల్లిలో పాఠశాలను ప్రారంభించనున్నారు. మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ఈ పాఠశాల ప్రారంభం కానుంది. దీనిపై గొత్తికోయవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది: పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రాచారి

ఈ పాఠశాలకు 2022లో ప్రధానోపాధ్యాయుడిగా చేరాను. అప్పటి నుంచి పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేశాను. కొని కారణాల వల్ల పాఠశాల భవనానికి పునాది పడలేదు. కానీ కలెక్టర్ చొరవతో ప్రీఫ్యాబ్రికెటెడ్ కంటైనర్ పాఠశాల సిద్ధం కావడం ఆనందంగా ఉంది. కంటైనర్ పాఠశాల నిర్మాణంతో విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా కంటైనర్ పాఠశాల లోపలి దృశ్యం

బై..బై.. గణేశా..

వరంగల్ నగరంలో ప్రశాంతంగా జరిగిన వినాయక నిమజ్జనం


కాజీపేట బంధం చెరువులో క్రేన్ సహాయంతో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది


చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనం అవుతున్న గణపతులు


చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద సైకిల్ రిక్షాపై వెళుతూ..


చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జనానికి కారుపై..


కాజీపేట బంధం చెరువు వద్ద బైక్‌పై వెళుతూ..




చిట్టి గణపతులను ఎత్తుకుని నిమజ్జనానికి తరలిస్తున్న యువతులు, చిన్నారి




వేయిస్తంభాల గుడి కోనేరులో నిమజ్జన దృశ్యం


వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద సిద్ధంగా ఉన్న రెస్క్యూ సిబ్బంది


ఆంధ్రజ్యోతి మడికొండ యూనిట్ ఆఫీసులో సిబ్బంది నిమజ్జన సంబురం


వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనంలో కలెక్టర్ సత్య శారద

సాయుధ సంగ్రామం.. విముక్తి గీతం..

'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్రభాగాన నిలిచింది. సాయుధ రజాకార్లు, నిజాం పోలీసుల అణిచివేసినా.. భూస్వామ్య జమిందారి వర్గం, తాబేదార్లు రాచరికానికి బాసటగా నిలిచినా.. ఎంతో మంది యోధులు ఎదురొడ్డారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఆయుధాలు చేత బట్టి.. జైళ్లలో మగ్గారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ ఉద్యమంలో వరంగల్ జిల్లా పోరాటాల గడ్డగా నిలిచి.. విమోచన ఉద్యమ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. కాకతీయులు ఏలినగడ్డపై రజాకార్లను ఎదురించిన వ్యక్తిగా బత్తిని మొగిలయ్య గౌడ్ నిలిచారు. అంతేకాదు బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల ఇలా ఎన్నో గ్రామాల్లో రజాకార్ల విధ్వంసకాండ నేటికీ గుర్తుండిపోయింది. ఈ నేపథ్యంలో రజాకార్ల అండతో చెలరేగిన దొరల దౌర్జన్యాన్ని ఎదురించిన చాకలి అయిలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకం చేసింది. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడిచేసి దాన్ని లేవనెత్తించారు. కడవెండి, అమ్మాపూర్, నాంచారిమడూరు తదితర ప్రాంతాల్లో సాగిన తెలంగాణ విమోచన ఉద్యమాలు ప్రజల స్వేచ్ఛా పిపాసకు నిలువెత్తు పతాకలు. నాడు నిజాంల అండతో రజాకార్లు విధ్వంసాలు, అకృత్యాలకు పాల్పడుతున్న వేళ ప్రజలు కొందరు పొరుగురాష్ట్రాలకు పారిపోయారు. మిగిలిన ప్రజల రక్షణ భారాన్ని ఉద్యమకారులు తీసుకున్నారు. నాడు పోరాట వ్యూహంలో భాగంగా ఉద్యమకారులు నైజాం స్టేట్‌లో కాక, ఇండియన్ యూనియన్ భూభాగాలైన చందా (మహారాష్ట్ర). గదక్ (కర్నాటక), విజయవాడ (ఆంధ్ర) మొదలైన ప్రాంతాల్లో సరిహద్దు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సరిహద్దు శిబిరానికి ఒక్కొక్కరు నాయత్వం వహించారు. విజయవాడలోని శిబిరం హయగ్రీవాచారి నాయత్వంలో నడవగా ఉద్యమ ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలను రాత్రివేళల్లో గ్రామాల్లో పంచేవారు. రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మందుగుండు సామగ్రి వచ్చేది. ఈ విధ్వంస రచనను గమనించిన కేంద్ర ప్రభుత్వం రజాకార్ల అరాచకత్వం, విశృంఖలత్వం అంతమొందించాల్సిన అవసరం గుర్తించి 1948 సెప్టెంబరు 13న పోలీసు చర్యకు ఆదేశించింది. ఆ సమయంలో చేపట్టిన ఆపరేషన్ పోలో విజయవంతం కావడంలో వరంగల్ మామునూరు విమనాశ్రయం ఎంతగానో దోహదపడింది. విమానాల ద్వారా సైన్యం ఇక్కడికి చేరుకుని రజాకార్లను ఎక్కడికక్కడ అణిచివేసింది. ఇక దిక్కులేని స్థితిలో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ తలవంచడంతో నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించింది.

పరకాల మారణ హోమం

విమోచన సంగ్రామంలో పరకాల మారణ హోమం ఒక రక్తసిక్త ఘట్టం. జన జాగృతిలో భాగంగా 1947 సెప్టెంబరు 2న తాలూకాకేంద్రం అయిన పరకాల సమీపంలోని పైడిపెల్లి తాటివనంలో ఉద్యమనాయకులు సమావేశం నిర్వహించగా ప్రజలు భారీగా తరలివచ్చారు. కానీ అప్పటికే ఒకవైపు పోలీసులు, మరోవైపు రజాకార్లు మోహరించారు. ఉద్యమాన్ని విరమించుకోవలని పోలీసులు సూచించినా ప్రజలు వినలేదు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాలతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. దీన్ని అదనుగా చేసుకున్న రజాకార్లు కూడా తల్వార్లు, కత్తులు, బరిసెలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అనేక మంది ప్రాణాలు విడిచారు. ఎంతోమంది కాళ్లు, చేతులు తెగిపడ్డాయి. మాంసం ముద్దలు, రక్తపుటేరులతో ఆ ప్రదేశమంతా భయంకరంగా.. మరో జలియన్‌వాలా బాగ్‌ను తలపింపజేసింది.

బైరాన్‌పల్లి బీభత్సం

నిజాం సైన్యం బలగాలను, రజాకార్ల రాక్షసకృత్యాలను బైరాన్‌పల్లి గ్రామస్థులంతా ఐక్యతతో ఎదురించారు. ఈ పోరాటానికి ఇమ్మడి రాజిరెడ్డి, జగ్గం హనుమంతు, చల్లా నర్సిరెడ్డి, మోటాపోశాలు, తోటరాములు ఇమ్మడి రాంరెడ్డి తదితర యోధులు నాయకత్వం వహించారు. ఓ రోజున రజాకార్లు దూలిమిట్ల, లింగాపురం గ్రామాలను దోచుకొని సొమ్మునంతా బండ్లపై తరలిస్తుండగా బైరాన్‌పల్లి రక్షక దళం రజాకార్లను ఎదురించి తరిమికొట్టింది. దీంతో బిత్తరపోయిన రజాకార్లు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. ఆ కక్షతో కూటిగల్ గ్రామంలో 20మందిని కాల్చి చంపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 12రోజులకే 1947 ఆగస్టు 27న అర్ధరాత్రి రజాకార్ల మూకలు బైరాన్‌పల్లిని చుట్టుముట్టి.. బైరాన్‌పల్లి బురుజుపై ఉన్న గస్తీదళ సభ్యులపై కాల్పులు జరిపారు. బురుజుపై ఉన్న పోరాటవీరులు తమ వద్ద ఉన్న మందుగుండు అయిపోయేంత వరకు సైన్యాన్ని నిలువరించగలిగారు. బురుజు వైపు నుంచి కాల్పులు ఆగిపోగానే సైన్యం బలగాలు గ్రామంలోకి ప్రవేశించి మారణహోమాన్ని సృష్టించాయి. పారిపోగా మిగిలిన 84 మందిని వరుసగా నిలబెట్టిన నిర్ధాక్షిణ్యంగా కాల్చిచంపారు రజాకార్లు. ఆ తదనంతర కాలంలో రజాకార్ల అండతో దొర సాగిస్తున్న దాష్టీకాలను చాకలి అయిలమ్మ ఎంతో ధైర్యంతో ఎదురించింది. దాడులను లెక్క చేయక మొక్కవోని ధీరత్వంతో పోరాటం సాగించి తన భూమిని కాపాడుకున్నది. ఐలమ్మ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని అనేకచోట్ల పోరాటయోధులు రజాకార్లకు వ్యతిరేకంగా దాడులు సాగించారు. తొర్రూరులో పోలీసుక్యాంపుపై దాడిచేసి దానిని లేవనెత్తించారు. కడవెండి అమ్మాపూర్, నాంచారిమడూర్‌కు చెందిన అనేక మంది పోరులో పాల్గొన్నారు. జఫర్‌గడ్‌లో, మధిర తాలూకా సిరిపురం గ్రామంలో రజాకార్లు సమరశీలురైన రైతులను కాల్చి చంపారు. 200 మంది రజాకార్లు వచ్చి అల్లీపురం గ్రామాన్ని తగులబెట్టారు. వీటికి ప్రతిగా పోరాటయోధులు ఆయా ప్రాంతాల్లో రజాకార్లపై ప్రతిదాడి జరిపి ప్రతీకారం తీర్చుకున్నారు.


పరకాలలోని అమరధామం

మొగిలయ్య వీరమరణం

రజాకార్ల దాష్టీకానికి పరాకాష్టగా నిలుస్తుంది బత్తిని మొగిలయ్య హత్యోదంతం. 1946లో తెలంగాణ విమోచనోద్యమం ఒక పక్క, భారత స్వాతంత్రోద్యమం మరో పక్క ముమ్మరంగా సాగుతున్న రోజులవి. వరంగల్ కోట నివాసి అయిన మొగిలయ్య మొదటి నుంచి విమోచనోద్యమంలో చురుకుగా పాల్గొనేవాడు. ఉద్యమంలో భాగంగా సర్వోదయ సంఘం పక్షాన ప్రతీవారం వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. 1946 ఆగస్టు 11న కోటలో జెండా ఎగురవేసిన తర్వాత కాశీంషరీఫ్ నాయత్వంలో రజాకార్లు హఠాత్తుగా దాడి చేశారు. రజాకార్లను ఎదరించే క్రమంలో మొగిలయ్య వారి కత్తిపోట్లకు గురై నేలకొరిగాడు.

'కాటారం' వీరులెందరో..

కాటారం, సెప్టెంబరు 16: తెలంగాణ విముక్తి పోరులో భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ (పూర్వ కరీంనగర్‌జిల్లా) వాసులెందరో వీరోచితంగా పోరాడారు. దామెరకుంట, మహదేవపూర్, మంథని ప్రాంతాలకు చెందిన యోధులు త్యాగాలు చేశారు. ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నాయకత్వం వహించగా, రఘునాథ్‌కాచే జిల్లాలో తొలి సత్యాగ్రహవాదిగా కీలక భూమిక పోషించారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నేతృత్వంలో దామెరకుంట, మహదేవ్‌పూర్, మంథనికి చెందిన వెంకటయ్య, చిన్న పోచిరెడ్డి, కొడిపెల్లి వెంకటయ్య, బక్క రాజయ్య, రాజిరెడ్డి, కిషన్‌రావు, ప్రభాకర్, చంటయ్య, రాజన్న, రాంపెల్లి కిష్టయ్య, దామోదర్, శివనాద్రి శంకరయ్య, నరహరి, సీతారాం తదితరులు సాయుధ పోరాటం చేశారు. స్వామి రామానందతీర్థ పిలుపుతో సత్యాగ్రహ ఉద్యమంలో రఘునాథ్ కాచే ఆధ్వర్యంలో గణపతి, రాజేశ్వర్‌రావు, రాజన్నచారి సహా పలువురు పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా పోరాడి కరీంనగర్, నిజామాబాద్ జైళ్లలో శిక్షను అనుభవించారు. దామెరకుంటకు చెందిన ఐత చిన్నపోచిరెడ్డిని రజాకార్ల సైన్యం ధన్వాడ వద్ద చంపడం విషాదాన్ని నింపింది. శ్రీరాములు బృందం మహారాష్ట్రలోని చంద్రాపూర్(చాందా)లో సాయుధ శిక్షణ పొంది, గడ్చిరోలి జిల్లా సిరొంచ కేంద్రంగా క్యాంపును ఏర్పాటు చేసుకుంది. అజ్ఞాతంలో ఉంటూ మంథని, మహదేవపూర్ తాలూకాల్లో నిజాం పోలీసు అధికారులపై గెరిల్లా దాడులు చేశారు. 1948లో గోదావరినది దాటి నిజాం సర్కార్ దామెరకుంట, కాళేశ్వరం, మహదేవపూర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్లపై దాడి చేశారు. దామెరకుంటలో కలెక్టర్ పర్యటన సందర్భంగా తహసీల్ అధికారులపై దాడి చేసి చంపిన సంఘటన సంచలనం రేపింది. ఈ దాడుల స్ఫూర్తితో ఈ ప్రాంతాల్లో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు.


సిల్వర్ జూబ్లీ స్వాతంత్ర్యానికి గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

రక్తమోడిన తమ్మడపల్లి(జి)

జఫర్‌గడ్, సెప్టెంబరు 16: తెలంగాణ సాయుధ పోరులో భాగంగా జఫర్‌గడ్‌ను కేంద్రంగా చేసుకుని నిజాం అనుచరుడైన రజాకార్ల నాయకుడు ఖాదరెల్లి చేస్తున్న దౌర్జన్యాలను అరికట్టేందుకు, రజాకార్లు, జాగీదారుల ఆగడాలను అడ్డుకునేందుకు ప్రజలు రక్షకదళాలను ఏర్పరచుకుని రాళ్లు, కర్రలు, వడిశాలలు, బర్సీలు, కత్తులు లాంటి సంప్రదాయ ఆయుధాలతో పోరుబాటలో నడిచారు. కమ్యూనిస్టు దళ నేతలు నల్ల నర్సింహులు, కృష్ణమూర్తి, యాదగిరిరావు, కూనూరు నెల్లుట్ల మోహన్‌రావు, పెండ్యాల రాఘవరావు, పంబాల రాఘవరావు, ఎలమంద, తదితరులు సంచరిస్తూ ఈ రక్షకదళాలు, ప్రజలు, రైతులను చైతన్యపరిచేవారు. సాయుధ పోరులో భాగం గా 1947, సెప్టెంబరు 11న జరిగిన ఆంధ్రమహాసభ తీర్మానాన్ని స్ఫూర్తిగా తీసుకుని జఫర్‌గడ్ ప్రాంతంలో రజాకార్ల ముఠాపై ప్రజలు, రైతులు తిరగబడి నిజాం, రజాకార్ల ప్రతినిధులను తరిమేశారు. దీంతో ఆగ్రహించిన ఖాదరెల్లి పోలీసులు, అనుచరులతో ప్రజలపై దాడులు చేయించాడు. కొద్దిరోజులకు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామాన్ని చుట్టుముట్టి.. గ్రామానికి చెందిన 12 మందిపై గ్రామ కూడలిలో నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చాడ అనంతరెడ్డి, బత్తిని బక్కరాజయ్య, దొంతూరి చినమల్లయ్య, ఎరుకలి ఇద్దయ్య, గుండెమల్ల పోశాలు, చెదలు నర్సయ్య, ఎండి.ఖాసీం, గుజ్జరి రామయ్య, దిడ్డి పెరుమయ్య, దుద్యాల చిన్న నర్సయ్య, గంద్రకుంట కోమటి నర్సింహరామయ్య, కుంట పెద్దాపురం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహావేశాలతో జఫర్‌గడ్‌లోని రజాకార్ల నేత ఖాదరెల్లి బంగ్లాపై దాడి చేసి, పశువుల కొట్టాన్ని, మొక్కజొన్న గూళ్లను దహనం చేశారు. పశువులను గ్రామస్థులకు పంపిణీ చేశారు.


జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి)లో అమరుల స్మారక స్థూపం


ఆయుధం పట్టిన కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి (అచ్చమాంబ)


ఆయుధం పట్టిన అచ్చమాంబ

జఫర్‌గడ్ మండలం కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి అచ్చమాంబ పేరుతో భర్త నెల్లుట్ల మోహన్‌రావుతో కలిసి సాయుధ పోరాటంలో ఆయుధం పట్టి నిజాం, రజాకార్లు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన అచ్చమాంబ 14ఏళ్ల వయసులోనే నిజాం, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంగా ఉద్యమంలో కూనూరుకు చెందిన దళ నేత నెల్లుట్ల మోహన్‌రావుతో ఏర్పడిన పరిచయంతో వివాహం చేసుకున్నారు. పోరాటంలో గాయపడిన కార్యకర్తలకు వైద్యం చేస్తూ.. మరోవైపు ఆమె మహిళలను చైతన్యవంతం చేస్తూ దళనాయకులతో కలిసి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం. ప్రస్తుతం భర్త చనిపోగా సుశీలాదేవి ప్రస్తుతం వరంగల్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు.

ఆగడాలకు ప్రత్యక్ష సాక్షి..

84ఏళ్లయినా చెక్కుచెదరని విస్నూరు గడి

పాలకుర్తి, సెప్టెంబరు 16 : నిజాం నవాబుకు ప్రధాన అనుచరుడైన విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి తన కోసం ఓ గడీని నిర్మించుకున్నారు. ఆ గడి పేరు చెబితే చాలు ఈ ప్రాంత వాసులు గడ గడలాడే వారు. నాడు సుమారు 60 గ్రామాల ప్రజలతో వెట్టి చాకిరీ చేయించి ఈ గడిని నిర్మించారు. ఇది జరిగి 84 ఏళ్లయినా ఆ గడీ ఇంకా చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది. కానీ నిజాం, దేశ్‌ముఖ్, రజాకార్ల ఆగడాలు, దమన కాండకు, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చేసిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీలు విస్నూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా ఎదురొడ్డి చేసిన పోరాటాలకు ఈ గడీ ప్రత్యక్షసాక్షిగా నిలిచింది.


విస్నూరు గడి ఇదే..

నెహ్రూ ఇంటి తరహాలోనే నిర్మాణం

అలహాబాద్‌లోని అప్పటి ప్రధాని నెహ్రూ ఇంటి నిర్మాణం తర్వాత మరెక్కడా లేని విధంగా ఈ భవనం అధునాతన పరిజ్ఞానంతో నిర్మించారు. గడి నిర్మాణాన్ని 1940లో ప్రారంభించి 1943లో పూర్తి చేశారు. విస్నూరు చుట్టూ ఉన్న 60 గ్రామాల ప్రజల నుంచి రజాకార్లను పంపించి బలవంతంగా వసూళ్లు చేసిన రూ.2లక్షలను ఈ గడి కోసం ఖర్చు చేశారు. ఐదున్నరక ఎకరాల్లో బ్రిటీష్ సివిల్ ఇంజనీరు ప్లాన్‌తోనే నిర్మాణం జరగ్గా.. అప్పటి కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి వల్లూరి బసవరాజు పర్యవేక్షణలో ఈ నిర్మాణం పూర్తి చేశారు. 20 గజాలలోతు, 3గజాల వెడల్పుతో పునాదులు తవ్వి అప్పుడు ఊరిన నీటిని ఆయిల్ ఇంజన్‌లతో బయటికి తోడించి సున్నం, కంకరను పునాదుల్లో పోసి దిమ్మిసలతో అదిమి, పకడ్బందీగా నిర్మించారు. 2 గజాల వెడల్పు, 5 గజాల లోతులో ఐదున్నర ఎకరాల్లో ప్రహరీ నిర్మించారు. రంగూన్ నుంచి బర్మా టేకును, స్విడ్జర్లాండ్ నుంచి జర్మన్ టెక్నాలజీ విద్యుత్ స్విచ్ బోర్డులు తెప్పించారు. ఇక మరుగుదొడ్ల నీరు బయటకు వెళ్లేందుకు 2 కిలోమీటర్ల దూరం అండర్ గ్రౌండ్ కాలువను నిర్మించారు. తుపాకుల తూటాలు గోడలోకి దూసుకుపోకుండా సీసం, పాచి తీగ, కోడిగుడ్లను దంగు సున్నంలో కలిపి గడి గోడలు కట్టారు. 1943లో గృహప్రవేశ కార్యక్రమం జరగ్గా నిజాంనవాబు హాజరై దేశ్‌ముఖ్‌కు ధనరాశులను బహుమతిగా అందించారు. అలాగే విస్నూరులో దేశ్‌ముఖ్‌కు రక్షణగా 1937లో తొలి పోలీస్ ఠాణాను నిర్మించగా.. రెండోది రంగారెడ్డి జిల్లాలో నిర్మించారు. 84 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మున్నూరు గడి చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది.


విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి (ఫైల్)

ఎందరో యోధుల స్ఫూర్తి

బందగీ పోరాటం చిరస్మరణీయం


కామారెడ్డిగూడెంలోని షేక్‌బందగీ సమాధి

దేవరుప్పుల, సెప్టెంబరు 16: నాటి నల్లగొండ జిల్లా జనగామ ప్రాంత విస్నూరు దేశ్‌ముఖ్ అయిన రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలు, అకృత్యాలకు ఎదురొడ్డి పోరాడిన దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య తొలి వీర మరణం పొంది చరిత్రకెక్కాడు. అంతేకాదు దేవరుప్పుల, ధర్మాపురం, కోలుకొండ, కడవెండి గ్రామాల్లోనే దాదాపు 40మంది విస్నూర్ దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా, నైజాం విముక్తిపోరులో పోరుసల్పి అసువులు బాశారు. గుండెనె ఉద్యమ జెండాగా చేసి పోరాడిన వారిలో దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంకు చెందిన షేక్‌బందగీ ఒకరు. విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి ఆధీనంలో ఉన్న గ్రామాల్లో ఆయన చెప్పిందే వేదం. షేక్‌బందగీ అన్న అబ్బాస్‌అలీ విస్నూర్ దేశ్‌ముఖ్‌కు ముఖ్య అనుచరుడు. అన్నదమ్ముల మధ్య భూ వివాదం ఏర్పడగా.. అబ్బాస్‌అలీకి ఎక్కువ భూమి ఇవ్వాలని విస్నూరు దొర తీర్పుచెప్పారు. దానిని అంగీకరించని బందగీ వాగ్వాదానికి దిగడంతో దొర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయినా తగ్గని బందగీ కోర్టుకు వెళ్లాడు. ఆ సమయంలో దొర ఎన్ని ప్రయత్నాలు చేసినా బందగీనే విజయం సాధించాడు. ఇలా పదేళ్లపాటు బందగీ చేసిన పోరాటం.. ఈ ప్రాంతంలో ఎంతో మందికి ధైర్యానిచ్చింది. కానీ బందగీపై కోపం పెంచుకున్న విస్నూరు దొర.. కోర్టు తీర్పు వచ్చిన ఆనందంతో ఉన్న బందగీ ఒక్కడే సూర్యాపేటకు వెళ్లే సమయంలో అతడి అన్న అబ్బాస్‌అలీని రెచ్చగొట్టి దాడి చేయించి తల నరికారు. అలా బందగీ ధైర్య సాహసాలను మరిచిపోలేని ప్రజలు కామారెడ్డిగూడెం స్టేజీ వద్ద బందగీ సమాధి కట్టారు. బందగీ స్ఫూర్తిని ఎంచుకొని 1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు యోధులు భారీగా తరలొచ్చారు. ఎక్కడ నలుగురు కలిసినా బందగీ ఉదంతమే చర్చకొచ్చేది.


కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారక భవనం




నగరంలో బ్యాండ్ కొడుతున్న ఇతర రాష్ట్రాల కళాకారులు

నిమజ్జన వేడుకల్లో తీన్మార్ జోష్

మట్టెవాడ, సెప్టెంబరు 16: నగరంలో గణేష్ నిమజ్జనోత్సవంలో వివిధ రకాలుగా సందడి కనబడింది. అనేకచోట్ల వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తరలివచ్చి గణపతి మండపాల వద్ద సందడి చేశారు. ముఖ్యంగా మహారాష్ట్ర నాందేడ్, అమరావతి ప్రాంతాల నుంచి బ్యాండ్ కళాకారులు వందల సంఖ్యలో నగరానికి చేరుకున్నారు. నిమజ్జనోత్సవంలో తీన్మార్ బ్యాండ్ మోత మోగించారు. వరంగల్ బట్టల బజార్, ఆర్ఎన్‌టీ రోడ్డు, జేపీఎన్ రోడ్డు, గిర్మాజిపేట ప్రాంతాల్లో నిమజ్జనం ఊరేగింపులో బ్యాండ్ మోగింది.

బై.. బై.. గణేశా..

(5వ పేజీ తరువాయి)

అందించాలని మునిసిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున తరలివచ్చిన నగర వాసులు

దేశాయిపేట రోడ్‌లోని చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జన వేడుకలను వీక్షించేందుకు నగర వాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. భారీ విగ్రహాలను క్రేన్‌లతో నిమజ్జనం చేయడాన్ని ఆసక్తి తిలకించారు. నిమజ్జన ప్రాంతంలో వివిధ రకాల వస్తువుల అమ్మకాలు, డప్పు చప్పుళ్ల మధ్య వినాయక విగ్రహాల తరలింపులతో సందడిగా మారింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బారీకేడ్లు ఏర్పాటు చేయడంతో జనాలు కిక్కిరిసిపోయారు. దీంతో ఆ ప్రాంతమంతా జాతర వాతావరణాన్ని తలపించింది.

40 ఫీట్ల మట్టి గణపతి

వరంగల్ ఎల్లంబజార్‌లోని భద్రకాళి హిందూ ఉత్సవ నిర్వహణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఖైరతాబాద్ వినాయకుడిని తలపించేలా ఎలాంటి రసాయనాలు వాడకుండా మట్టితో 40 ఫీట్ల ఎత్తుతో సుమారు రూ.30 లక్షలతో వినాయకుడిని తయారు చేయించారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ వినాయకుడిని ప్రతిష్ఠించడం జరిగిందని నిర్వాహకుడు ఆకుతోట సంజీవ్ తెలిపారు.

ఉత్సవాల ఖర్చు రూ.100 కోట్లపైనే..

ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయకులు మినహా వీధులు, జంక్షన్లలో, కాలనీలలో, వ్యాపార సముదాయాల్లో ప్రతిష్ఠించిన వినాయక నవరాత్రి ఉత్సవాల ఖర్చు ఈసారి అధికంగానే అయినట్లు తెలుస్తోంది. మండపాల అలంకరణ, నిత్యపూజలు, గణపతి విగ్రహాలకు, అన్నదానాలకు, డీజేలకు, లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలకు ఒక్కో వినాయక మండపానికి రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాల ఖర్చు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

అనుక్షణం.. బల్దియా అప్రమత్తం..

(5వ పేజీ తరువాయి)

చెరువు వద్ద 30 మంది సిబ్బంది కలిసి మూడు షిఫ్టులలో ప్రత్యేక దుస్తులు ధరించి విధులు నిర్వర్తించారు. పెద్ద క్రేన్‌ల సహాయంతో గణపతి విగ్రహాలను చెరువులలో నిమజ్జనం చేశారు. చెరువుల వద్ద సిబ్బందికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు దగ్గరుండి పర్యవేక్షించారు. మధ్యాహ్నం నుంచి జరిగిన నిమజ్జన వేడుకలను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ సుధారాణి దగ్గరుండి పరిశీలించారు. చిన్నవడ్డెపల్లి చెరువులో జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని క్రేన్‌లో ఎక్కి పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు.

సిబ్బందికి ఏర్పాట్లు

నగరంలోని చెరువులు, కుంటల వద్ద విధులు నిర్వర్తిస్తున్న బల్దియా, పోలీసు, రెవెన్యూ, ఇంజనీరింగ్, మత్స్యశాఖతో పాటు అక్కడ పని చేయడానికి వచ్చిన దినసరి కూలీలకు బల్దియా పబ్లిక్‌హెల్త్ విభాగం భోజన ఏర్పాటు చేసింది. సోమవారం మధ్యాహ్నం 4వేల మందికి రాత్రి 6వేల మంది సిబ్బందికి భోజనం అందించినట్టు శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ తెలిపారు. అంతేకాకుండా చెరువుల వద్ద సిబ్బందికి మంచి నీరు అందించారు. బల్దియా ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెరువుల చుట్టుపక్కల సీసీ కెమెరాల ఏర్పాటు చేసి బల్దియా కంట్రోల్ రూంకు అనుసంధానం చేసినట్టు ఎస్ఈ రాజయ్య తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరిగినా కెమెరాలలో రికార్డు అయ్యేందుకు ఐసీసీసీ విభాగం నుంచి ఐటీ సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్

గణేష్ మండపాల నుంచి నిమజ్జన ప్రదేశాలకు తరలించే సమయంలో వాహనాల నుంచి తొలగించిన వ్యర్థాలు, రోడ్లను శుభ్రం చేసేందుకు మంగళవారం శానిటేషన్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ చేయనున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలెపాక అనీల్‌కుమార్ తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందిని మినహాయించి స్టాండింగ్ సిబ్బందితో నగరంలోని రోడ్లు, కాలనీలు శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజులు పాటు చెరువులు వద్ద విధులు నిర్వర్తించి ప్రజలకు సహకరించిన బల్దియా సిబ్బందిని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి అభినందించారు. నిమజ్జన కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించి ఘనంగా సత్కరిస్తామని సీఎంహెచ్‌వో రాజేశ్ తెలిపారు.

గంగమ్మ ఒడికి గణపయ్య

▸▸ నగరంలో ప్రశాంతంగా గణనాథుల నిమజ్జనం ▸▸ జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో భారీ క్రేన్‌లు, తెప్పల ఏర్పాటు

కరీమాబాద్, సెప్టెంబరు 16: నగరంలో నవరాత్రులు భక్తులపూజలందుకున్న గణనాథులు సోమవారం గంగమ్మ ఒడికి చేరారు. వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని 40వ డివిజన్‌లోగల ఉర్సు రంగసముద్రం చెరువులో గణపతి నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగాయి. ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, రంగశాయిపేట, శంభునిపేట, ప్రాంతాలలోని గణపతి విగ్రహాలు నిమజ్జనానికి ఇక్కడికి తరలివచ్చాయి. ఈ చెరువు వద్ద ఉదయం నుంచే నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. 9 రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనాలకు తరలిరావడంతో ఉర్సు చెరువు ప్రాంతం సందడిగా మారింది. సుమారు 150కి పైగా విగ్రహాలు సాయంత్రం సమయానికి చెరువులో నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలను చెరువు వద్ద భారీ క్రేన్ సహాయంతో నిమజ్జనాలకు తరలించారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను, సిబ్బందిని ఏర్పాటు చేశారు. నిమజ్జనాల వద్ద అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏసీపీ నందిరాం నాయక్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ఎస్సైలు చెరువు ప్రాంతంలో నిమజ్జనం ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి నిమజ్జనాలను పరిశీలించారు. అలాగే, ఉర్సు దర్గా ప్రాంతంలో నెలకొల్పిన గణనాథుడిని శాకంబరుడి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు పత్యేక పూజలు చేయగా, అన్నదాన కార్యక్రమం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

• కాశిబుగ్గ: నగరంలోని కాశిబుగ్గ, వివేకనంద కాలనీ, పద్మనగర్, ప్రతాపరుద్ర కాలనీ, ఓసిటీ, సొసైటీ కాలనీ, తిలక్‌రోడ్డు, గాంధీనగర్ తదితర కాలనీల్లో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకగా శోభాయాత్ర నిర్వహించారు. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ గణేష్‌లను ఊరేగించారు. స్థానికుల ఆనందోత్సాహాల మధ్య చిన్నవడ్డెపల్లి చెరువులో గణపతులను నిమజ్జనం చేశారు. కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేలంలో బాంబుల కుమార్ రూ.81 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

• శంభునిపేట: నగరంలోని రంగశాయిపేట మహంకాళియూత్ ఆధ్వర్యంలో నిర్వహిసున్న ఉత్సవాలలో భాగంగా సోమవారం అయ్యప్ప పూజను


లేబర్‌కాలనీలో గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

తలపించేలా లంబోదరుడికి అభిషేకాలు నిర్వహించారు. ఫల, పుష్ప, నవరస పంచామృతాలతో వినాయకుని ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోనే ఈ గణేష్ శోభాయాత్రకు ప్రత్యేక పేరుంది. కార్యక్రమంలో కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, కందగట్ల జీవన్, సిద్దార్థ, ప్రసాద్, తివారి మహేష్, మండల మొగిలి, ఆవునూరి రాకేష్, రాము, గీతా కరుణాకర్‌రెడ్డి, చిట్టి ఈశ్వర్, చాపల మనోహర్, సుధీర్, దువ్వ గణేష్, శ్రీధర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిపేట పీహెచ్‌సీ సెంటర్ వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆఖరి రోజు కావడంతో వేలాది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని తీసుకున్నారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్ గుండు చందనపూర్ణ చందర్, అనుమాసు కామేశ్వర్, దున్నాల విజయ్, వెంకట్, ఇటికాల మధు, రేకులపల్లి దామోదర్,


రంగశాయిపేటలో కారులో గణేష్ శోభాయాత్ర

సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే 17, 41, 42, 43, 17 డివిజన్లలోని రంగశాయిపేట, శంభునిపేట, ఉర్సు ప్రాంతాల్లోని గణనాథులను స్థానిక బెస్తం చెరువులో నిమజ్జనం చేశారు. స్థానిక కార్పొరేటర్లు గుండు చందనపూర్ణ చందర్, పోశాల పద్మస్వామి, ఈదురు అరుణవిక్టర్, గద్దె బాబు, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, కర్నె రవీందర్, యాదాల జగపతి, తదితరులు శోభాయాత్రలో పాల్గొన్నారు. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సీఐ రవికుమార్, ఎస్ఐలు కృష్ణవేణి, శ్రీకాంత్‌లఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

• ఖిలావరంగల్: 18వ డివిజన్ లేబర్‌కాలనీలో యువ యూనిట్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ సారయ్యను మాజీ కార్పొరేటర్ జన్ను రవి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పందిరి రమేష్, బలభద్ర సాంబయ్య, గుండేటి కమలాకర్, చిప్ప జీవన్, సరుగు సుధాకర్, దుర్గయ్య, చిప్ప నాగరాజు, పోలు భిక్షపతి, యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఖిలావరంగల్ పడమరకోట వాసులు స్థానిక మాలఅగర్తల చెరువులో నిమజ్జనంచేయగా, మధ్యకోట ప్రజలు ఏకశిల గుట్ట ప్రాంతంలోని గుండు చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే 37వ డివిజన్ తూర్పుకోట ప్రజలు గణపతులను పెద్దమర్ల చెరువులో నిమజ్జనం చేశారు. ఖమ్మంరోడ్, రుద్రమాంబనగర్, శివనగర్, వాల్‌మార్ట్, ఇసుక అడ్డా, పెరకవాడ, అండర్‌బ్రిడ్జి, ఏసిరెడ్డినగర్, మైసయ్య నగర్, పాడి మల్లారెడ్డినగర్ ప్రాంత ప్రజలు గణపతులను వడ్డెపల్లి చెరువుకు తరలించారు. 18వ డివిజన్ లేబర్‌కాలనీ, క్రిస్టియన్‌కాలనీ, గాంధీనగర్, శాలినినగర్, చెన్నారెడ్డినగర్ తదితర ప్రాంత ప్రజలు కట్టమల్లన్న చెరువులో గణపతులను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, 18, 34, 35, 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమ-దామోదర్‌యాదవ్, వస్కులబాబు, సోమిశెట్టి ప్రవీణ్, దిడ్డి కుమారస్వామి, పోలీసు, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, నగరపాలక సంస్థ, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఉర్సు చెరువులో గణపతి నిమజ్జనంలో పాల్గొన్న ఏసీపీ నందిరాం నాయక్, మీల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, కార్పొరేటర్ మరుపల్ల రవి



గుండు చెరువులో గణపతిని నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న కార్పొరేటర్ బైరబోయిన ఉమ-దామోదర్ యాదవ్


బెస్తం చెరువు వద్ద నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న డీసీపీ రవీందర్, సీఐ


కాశిబుగ్గలో బాల గణపతి శోభాయాత్ర

భారీగా పోలీసు బందోబస్తు

(5వ పేజీ తరువాయి)

15 చెరువుల్లో పెద్దఎత్తున గణేష్ నిమజ్జనం జరిగింది. ఉదయం నుంచే నిమజ్జనం కోసం శోభాయాత్రలు నగరంలో ప్రారంభమయ్యాయి. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అడుగడుగునా పోలీసులు విధులు నిర్వహించారు. ఇద్దరు డీసీపీలతోపాటు 11మంది ఏసీపీలు ట్రైసిటీస్‌లో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఆయా నిమజ్జన ప్రదేశాల్లో సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు బందోబస్తు విధుల్లో ఉన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ట్రై సిటీస్ పరిధిలోని వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జన సమయంలో ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. 15 నిమజ్జన ప్రదేశాల్లో 135 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువు, వరంగల్ రంగశాయిపేటలోని బెస్తం చెరువు, హనుమకొండలోని సిద్ధేశ్వర గుండం, కాజీపేట పరిధిలోని బంధం చెరువుల్లో వినాయక విగ్రహాలను ఎక్కువ మొత్తంలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాల శోభాయాత్రతో ట్రైసిటీస్ పరిధిలోని రోడ్లు భక్త జనంతో నిండిపోయాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనాలు నగరంలోనికి రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. నగర పరిసర ప్రాంతాల్లో పోలీసులను ఏర్పాటు చేసి వాహనాలు నగరంలోని రాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు. మొత్తంగా వినాయక నిమజ్జన ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు.

400 మంది పోలీసులతో బందోబస్తు


చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద బందోబస్తులో ఏసీపీ నందిరాం నాయక్, పోలీసులు

మట్టెవాడ, సెప్టెంబరు 16: వరంగల్ పోలీసు సబ్ డివిజన్‌లో నాలుగు ప్రాంతాల్లో గణేష్ నిమజ్జన ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు, ఉర్సు, రంగసముద్రం చెరువు, గుండు చెరువు, అగర్త చెరువుల వద్ద గణేష్ నిమజ్జనానికి 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. వరంగల్ సబ్ డివిజన్ పోలీసులతో పాటు పోలీసు ట్రైనింగ్ కాలేజ్ కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలు, క్యూఆర్టీ సిబ్బంది, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్ల బందోబస్తులో పాల్గొన్నారు. వీరితో పాటు వరంగల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, షీ టీం పోలీసులు సైతం విధులు నిర్వర్తించారు.

బోసిపోయిన కోట చెరువు

▸▸ నిమజ్జనం చేయకుండా బందోబస్తు

▸▸ చిన్నవడ్డెపల్లికి భారీగా వచ్చిన గణేష్ విగ్రహాలు

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 16: వరంగల్ నగరంలోని కోట చెరువులో వినాయక నిమజ్జన వేడుకలు నిలిపివేయడంతో చెరువు ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. ప్రతి సంవత్సరంలాగే ఈసారి కోట చెరువులో నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఇచ్చిన ఆదేశాల మేరకు నిమజ్జన వేడుకలు నిలిపివేశారు. దీంతో కోట చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేయకుండా సోమవారం పోలీసు అధికారులు భారీ బందోబస్తు నిర్వహించారు. చెరువులోకి వెళ్లకుండా రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు, బారికేడ్లు అడ్డుగా పెట్టి విధులు నిర్వర్తించారు. ఏర్పాట్లు చేసినా వేడుకలు లేకపోవడంతో కోట చెరువు ప్రాంతం బోసిపోయి కనబడింది.

చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జనానికి..

కోట చెరువులో వినాయక నిమజ్జనం నిలిపివేయడంతో దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువులోకి విగ్రహాలు నిమజ్జనానికి భారీగా తరలివచ్చాయి. ప్రతి ఏటా చిన్నవడ్డెపల్లి చెరువులో సుమారు 1,500 వరకు వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగుతుంది. ఈసారి కోట చెరువులో నిమజ్జనం నిలిపివేయడంతో సుమారు 500 విగ్రహాల వరకు చిన్నవడ్డెపల్లి చెరువుకు తరలివెళ్లాయి. దీంతో చిన్నవడ్డెపల్లి చెరువులో సుమారు 2వేల విగ్రహాలకు పైగా నిమజ్జనం జరిగినట్లు తెలుస్తుంది.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

▸▸ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ఖిలావరంగల్, సెప్టెంబరు 16: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈనెల 22న జరుగు తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్స్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో సోమవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆటో, మోటార్ రంగ సమస్యల పరిష్కారం కోసం 1969లో మొట్టమొదటగా ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో విస్తరించి 2021లో రాష్ట్ర వ్యాప్తంగా ఆటోకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ తరువాత ఆటో రంగమే ప్రజలకు గ్రామీణ, పట్టణాలలో ప్రజా రవాణా సౌకర్యం కల్పిస్తూ స్వయం ఉపాధితో జీవనం పొందుతున్న కార్మికులు 15లక్షల మంది ఉన్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోరంగం పూర్తిగా కుదేలైందని పేర్కొన్నారు. ఆటో, క్యాబ్ మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పడం జరిగిందన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్న హామీ నెరవేర్చలేదన్నారు. అందులో


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భాగంగా ఆటో, క్యాబ్, మోటార్ రంగ కార్మికుల సమస్యల సాధనకై ఈ నెల 22న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర 3వ మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, గుండె భద్రి, జిల్లా ఉపాధ్యక్షులు పనాస ప్రసాద్, ఎమ్డీ.యాకోబు, జిల్లా నాయకులు అక్బర్, ఎన్.కుమార్, ఎ.సుమలత, సింగారపు విక్టోరియా, వెంకటాద్రి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 16: వరంగల్ భద్రకాళి దేవాలయం ప్రాంతంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం 5 నుంచి 11 గంటల వరకు విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి, ప్రధానార్చకులు గూటోజు కేదారేశ్వరచారి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

రైలులో ప్రయాణిస్తూ వ్యక్తి మృతి

గిర్మాజిపేట, సెప్టెంబరు 16: విజయవాడ నుంచి జాల్నా(ఉత్తరప్రదేశ్)కు దురంతో ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం ప్రయాణిస్తున్న విశ్వంబర్ (46) అనే వ్యక్తి అనారోగ్యంతో రైలులోనే మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జల్నా జిల్లా దౌన్ కు చెందిన విశ్వంబర్ అనారోగ్యం కారణంగా విజయవాడలో కుమారుడు ఆకాశ్ వద్ద కొంతకాలంగా ఉంటూ వైద్యం పొందుతున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో తమ సొంతూరు జల్నాకు కుమారుడు ఆకాశ్‌తో కలిసి సోమవారం విజయవాడలో దురంతో ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఈ రైలు విజయవాడ తరువాత బల్లార్షలో మాత్రమే ఆగుతుంది. అయితే విశ్వంబర్ ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో రైలులోని చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ రైల్వే కంట్రోల్ ద్వారా వరంగల్ జీఆర్పీకి సమాచారం ఇచ్చినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు 108 అంబులెన్స్‌ను ప్లాట్‌ఫారం-2 వద్ద సిద్ధంగా ఉంచారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో దురంతో ఎక్స్‌ప్రెస్ చేరుకోవడంతో 108 సిబ్బంది రైలులోకి వెళ్లి చూడగా విశ్వంబర్ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ప్లాట్‌ఫారంపైకి తీసుకువచ్చి ఎంజీఎం ఆస్పత్రిలో భద్రపరిచినట్లు చెప్పారు. కుమారుడు ఆకాష్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రిడ్జిని మరమ్మతు చేయాలి : సీఐటీయూ

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 16: వరంగల్‌లోని వై-ఆకారంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని తక్షణమే మరమ్మతు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని అన్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రతన్‌గౌడ్, రాఘవరెడ్డి, శ్యాంసుందర్, శంకర్, వైకుంఠం పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉల్ నబీ వేడుకలు

శంభునిపేట, సెప్టెంబరు 16: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని 37వ డివిజన్ గిరిప్రసాద్ నగర్‌లో మైనారిటీ నాయకుడు, ఎస్డీ.షబ్బీర్ ఆధ్వర్యంలో సోమవారం జెండా గద్దె ముందు పాయసం పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణసురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే శంభునిపేట జంక్షన్‌లో మహ్మదీయ మసీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, పాయసం పంపిణీ చేపట్టారు. నవాజ్, హంసా బేకరీల నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పాయసం పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

• కాశిబుగ్గ : మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరనీయమని కాంగ్రెస్ సీనియర్ నేత మహ్మద్ అమీర్ పాషా(చోటు బాయ్) అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సోమవారం ఎల్‌బీనగర్‌లో ఇంటింటికి వెళ్లి మిఠాయి డబ్బాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త బోధించిన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వం, దాతృత్వం, సర్వమానవ సమానత్వం అనే సుగుణాలు మనిషిని ఉత్తమ మార్గంలో పయనించేలా చేస్తాయని తెలిపారు. మహ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకమైనవని ఆయన వివరించారు.

ఆడ పిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలు చేస్తారు

▸▸ ఐసీఏఆర్ ఆల్ ఇండియా ర్యాంకర్ సుష్మాక్షితకు సత్కారం

శంభునిపేట, సెప్టెంబరు 16: ఆడ పిల్లలను ప్రోత్సహించి చదివిస్తే అద్భుతాలు సృష్టిస్తారని బీజేపీ జిల్లా నాయకుడు, కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో నగరంలోని 41వ డివిజన్ విశ్వనాథకాలనీకి చెందిన పల్లంకొండ సుష్మాక్షిత ఆల్ ఇండియా 349వ ర్యాంకు సాధించింది. ఎస్టీ రిజర్వేషన్ కోటాలో 4వ ర్యాంకు సాధించిన ఘనతను దక్కించుకుంది. ఈ సందర్భంగా కాలనీస్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సుష్మాక్షితను విశ్వనాథకాలనీలోని ఆమె నివాసంలో సోమవారం ఘనంగా సత్కరించారు. పిల్లలకు సరైన దిశానిర్దేశం చూపి ప్రయోజకులుగా మార్చేందుకు తల్లిదండ్రులు శ్రమ పడుతుంటారని, ఆ శ్రమను వృథా చేయకుండా సుష్మాక్షితను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు కష్టపడాలని రవీందర్ సూచించారు. లింగ బేధం లేకుండా పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరుశరాములు అన్నారు. కార్యక్రమంలో పలు కాలనీల బాధ్యులు శ్రీనివాస్ గుప్తా, పల్లంకొండ సురేష్, కత్తి ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సుష్మాక్షితను సత్కరిస్తున్న కర్నె రవీందర్



కాలం చెల్లిన మందులు వేసుకొని అస్వస్థత



చికిత్స పొందుతున్న బండారి అశోక్

వర్ధన్నపేట , సెప్టెంబరు 16 : కాలం చెల్లిన మందులను వేసుకొని అస్వస్థతకు గురైన వ్యక్తి ఉదంతం ఇది. వివరాల్లోకి వెళ్తే రాయపర్తి మండల కేంద్రానికి చెందిన బండారి అశోక్ వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చారు. ఆస్పత్రి సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రిలో నిల్వ ఉన్న కాలం చెల్లిన మందులను బండారి అశోక్‌కు ఇచ్చారు . అవి వేసుకున్న అశోక్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో మందులు ఇవ్వడంతో, అవి వేసుకున్న అశోక్ అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖానాపురం, సెప్టెంబరు 16 : తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు తెలంగాణ ప్రభుత్వం ఉద్యమ బంధు ప్రకటించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమల శ్రీనివాస్ అన్నారు. దక్షిణ తెలం గాణ ఉద్యమకారుల బస్సు యాత్రలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన విధంగా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర మహిళా విభాగం బాధ్యురాలు జ్యోతిరెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులకు ప్రభుత్వం ఉద్యమకాలనీలను నిర్మించాలన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో జరిగే ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో అందరూ భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒల్లెపు శ్రీనివాస్, పైండ్ల యాదగిరి, మస్తాన్, ఓర్సు రవి, అనంతుల వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, వేల్పుల లింగయ్య వల్లే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీ అమరవీరుల ఆశయాలు కొనసాగించాలి

దుగ్గొండి, సెప్టెంబరు 16 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని, దానికి అందరం కలసి కట్టుగా ప్రజా ఉద్యమాలు చేపట్టాలని ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి ఎండీ. రాజాసాహెబ్ పిలుపు నిచ్చారు. మండలంలోని అడవిరంగాపురంలో సోమవారం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నర్సంపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాలకు దివంగత మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ నామకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్, బుడిమె సురేందర్, కుమారస్వామి, శ్రీను, సతీష్, కిరణ్, కమలాకర్, గాంధీ, దేవేందర్, సతీష్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 16 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంత మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జీపీ కార్యదర్శి రామారావు, సీసీ గోలి కొమురయ్య సూచించారు. సోమవారం మండలంలోని ఇల్లంద గ్రామంలోని జీపీ కార్యాలయంలో డీఆర్డీఏ క్షేత్రస్థాయి సిబ్బందికి ఇందిరా మహిళా శక్తి పథకం అమలు పై క్లస్టర్ లెవల్ సమీక్ష నిర్వహించారు. నేటి నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛత హి సేవా పక్షోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీవో ప్రతినిధులు భవాని, వీవోఏలు కత్తి స్రవంతి, శోభ, పద్మ, రమా, సిబ్బంది పాల్గొన్నారు.

'మండల అధ్యక్షుడిని పార్టీ నుంచి తొలగించాలి'

సంగెం, సెప్టెంబరు 16: మండలంలో కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న మండల శాఖ అధ్యక్షుడిని పార్టీ నుంచి తొలగించాలని సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సంగెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాట్రపల్లికి చెందిన మందాటి లక్ష్మారెడ్డి, సంగెంకు చెందిన మెట్టుపల్లి ఏలియా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కొన్నేళ్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పార్టీ మండల అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి ఒంటెద్దు పోకడతో సీనియర్లను పట్టించుకోవడంలేదన్నారు. మండలంలో పార్టీ తీరును మెరుగుపర్చాలని చెప్పినందుకుగాను ఏకంగా తమపై పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు ఆరోపించారు. తాము జిల్లాస్థాయి నాయకులుగా పదవులు అనుభవిస్తున్నామని, తమకు నోటీసులు జారీచేసే అర్హత మండల శాఖ అధ్యక్షుడికిలేదని చెప్పారు. గ్రామాల్లో పార్టీని గ్రూపులుగా విభజించి కార్యకర్తల్లో భయానక వాతావరణం కల్పిస్తున్నట్లు వివరించారు. స్వలాభం కోసం మాధవరెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంగెం మాజీ సర్పంచ్ ఎల్లయ్య, కట్టస్వామి, ప్రవీణ్, కుమారస్వామి, శంకర్‌నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గౌరీ తనయుడు









నర్సంపేటలో గణపతి ఊరేగింపు నిర్వహిస్తున్న పద్మశాలి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, నర్సంపేట దామెర చెరువు వద్ద నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సత్యశారద, దామెర చెరువులో గణపతులను నిమజ్జనం చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

నర్సంపేట, సెప్టెంబరు 16 : వినాయకచవితి నుంచి పూజలందుకున్న బొజ్జగణపయ్య తల్లి గంగమ్మచెంతకు చేరాడు. పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయం, రామాలయం, పట్టణ ఆర్యవైశ్యసంఘం, పద్మశాలిగార్డెన్, రెడ్డి సంఘం, బాలుర హైస్కూల్ దగ్గర, పాఖాలరోడ్, వల్లబ్‌నగర్, నెక్కొండరోడ్, శాంతినగర్, స్నేహనగర్, అంగడి ఆవరణ, వ్యాపార, వర్తకసంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని 24వార్డుల పరిధిలో ఏర్పాటుచేసిన గణపతులను అలంకరించిన వాహనాల పై ప్రతిష్ఠించి మేళతాళాలు, మహిళల కోలాటాలు, యువకుల నృత్యాల నడుమ గణపతిబొప్పా మోరియా, జైబోలో గణేశ్ మహరాజ్‌కి జై, జైజై గణేశా అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపులు నిరహించారు. ఇళ్ల ముంగిట నుంచి వెళ్తున్న వినాయకుడి విగ్రహాలకు మహిళలు హారతులు ఇచ్చి టెంకాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు.నిమజ్జన ప్రాంతమైన సర్వాపురం సమీపంలోని దామెర చెరువు వరకు తీసుకెళ్లారు. చెరువు వద్ద ఒక్కొక్క గణపతి విగ్రహాన్ని మునిసిపల్ సిబ్బంది తెప్పలపై తీసుకెళ్ళి నిమజ్జనంచేశారు. ప్రధాన రహదారుల వెంట పోలీసు బందో బస్తును ఏర్పాటు చేశారు.

ప్రశాతంగా నిమజ్జనం జరపాలి : కలెక్టర్

నర్సంపేటపట్టణంలోని దామెరచెరువులో గణపతుల నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. సోమవారం రాత్రి పట్టణంలోని గణపతుల నిమజనం జరిగే దామెర చెరువు కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ వచ్చిన సమయంలో చెరువులో నిమజ్జనం కోసం గణపతుల వాహనాలు రాలేదు. దీంతో అధికారులతో నిమజ్జన కార్యక్రమంపై మాట్లాడి సూచనలు చేశారు. కలెక్టర్ చెరువును సందర్శించి వెళ్తుండగా ఓ యువకుడు గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వినాయక విగ్రహాన్ని చేతులతో పట్టుకొని చెరువు వద్దకు వస్తుండగా అతనితో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, ఆర్ఐ రజాక్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ ఇతర ఉద్యోగులు ఉన్నారు.

● వర్ధన్నపేట : పట్టణంలో గణపతుల నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఊరేగింపులో భక్తులు కోలాటాలు, బ్యాండు వాయిద్యాలతో భజనలుచేస్తూ శోభాయాత్ర సాగింది. కోనారెడ్డి చెరువులో నిమజ్జనం చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ఆటో నగర్ మండపం వద్ద లడ్డు వేలంపాట ఉత్సాహంగా సాగి అంజి మేస్త్రీ రూ.23,011లకు చేజిక్కించుకున్నాడు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఇల్లంద, కట్ర్యాల, ల్యాబర్తి, దమ్మన్నపేట, రామవరం, కొత్తపెల్లి, నల్లబెల్లి వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల నుంచి గణపతిని శోభాయమనంగా అలంకరించి శోభాయాత్ర నిర్వహించారు. గ్రామాల్లోని చెరువుల వద్ద పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.

● చెన్నారావుపేట : మండలంలోని గ్రామాల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.హనుమాన్ దేవాలయంలో, కట్టయ్యపల్లెలో కొలువుదీరిన గణపతులు, సిద్దార్థ హై స్కూల్‌లోనిమట్టి గణపతిని కోపాకుల చెరువులో నిమజ్జనానికి తరలించారు.

● నెక్కొండ : మండలంలోని గ్రామాల్లో నెలకొల్పిన గణపతులను ఆయా గ్రామాల్లోని ఊర చెరువుల్లో నిమజ్జనం చేశారు. మండపాల్లో లడ్డులకు, గణేశ్ మాలలకు వేలం పాటలను నిర్వహించగా భక్తులు వేలం పాటల్లో లడ్డు ప్రసాదాలు, మాలలు కైవసం చేసుకున్నారు. నెక్కొండలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, రజక బజారు, గౌతమినగర్, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశులను నిమజ్జనం చేశారు.

● ఖానాపురం : మండలంలో కొలువుతీరిన గణపతులను నిమజ్జనం చేశారు. ధర్మరావు పేట, రాగంపేట, బుధరావుపేట, రంగాపురం, దబీర్‌పేటలోని చెరువులు, వాగుల్లో ఏర్పాటు చేసిన గణేశ్ నిమజ్జన ప్రదేశాలను ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో పర్యవేక్షణ నిర్వహించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌లు భద్రతా ఏర్పాట్లను నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద నైవేద్యంగా పెట్టిన 31 కిలోల లడ్డునూ మార్కండేయ వాడకు చెందిన యువయూత్ సభ్యులు రూ.23,116లకు దక్కించుకున్నారు.

● దుగ్గొండి : మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని తిమ్మంపేటలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగింపుగా చేసి స్థానిక అబ్బసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. ప్రశాంతంగా నిమజ్జనాలు నిర్వహించేందుకు స్థానిక ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తగు సూచనలు చేస్తూ గ్రామాలను సందర్శించారు.

● గీసుగొండ : మండలంలో గణనాథుల నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. అల్లం బాలకిశోర్‌రెడ్డి-స్వప్న దేవి దంపతులు కొమ్మాల, విశ్వనాథపురంలో అన్నదానం చేశారు. కట్టమల్లన్న వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనాలను ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సూచనలు చేశారు. ఆయన వెంట మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ బాబులాల్, ఎస్ఐలు ఉన్నారు. 16వ డివిజన్ ధర్మారంలో యలమంచలి రాజేంద్రప్రసాద్, ప్రభావతి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు భద్రాచలంకు తరలివెళ్లారు.

● సంగెం: మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను చెరువుల్లో నిమజ్జనం చేశారు. గ్రామాల్లోని చెరువుల వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో నిమజ్జనం జరిగింది. ఎల్గూరు చెరువు వద్ద ఎన్నడూలేని విధంగా క్రేన్‌ను ఏర్పాటు చేశారు.

● నల్లబెల్లి : మండలంలో గణేశుడి నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. అంతకు ముందు నిర్వాహకులు అన్నదానం చేశారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

● పర్వతగిరి : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలను వాహనాల్లో అందంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. బాణా సంచా కాల్చి, డప్పుచప్పుళ్లతో నిమజ్జనం చేశారు.

నర్సంపేట సివిల్ ఆస్పత్రిని నెక్కొండలో ఏర్పాటు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ, సెప్టెంబరు 16 : నర్సంపేట డివిజన్‌లో పెద్ద మండలమైన నెక్కొండలో నర్సంపేట సివిల్ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని నెక్కొండ సొసైటీ చైర్మన్ మారం రాము, మాజీ ఎంపీపీ జాటోతు రమేశ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నాయకులు కొమ్ము రమేశ్, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం నెక్కొండలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డివిజన్‌లో అత్యధికంగా గిరిజన తండాలు, గ్రామాలు ఉన్న ఏకైక మండలమైన నెక్కొండలో 50 పడకల సివిల్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాజీ వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కోరినట్లు వారు తెలిపారు. అయితే నర్సంపేటకు ఆస్పత్రితో కూడిన వైద్య కళాశాల మంజూరి చేశామన్ని నర్సంపేటలోని 50 పడకల ఆస్పత్రిని నెక్కొండకు తరలిస్తామని అధికారిక ప్రకటన కూడా మంత్రి హోదాలో ఉన్నప్పుడు హరీశ్ రావు చేశారన్నారు. ఈ విషయమై నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకుని ఆస్పత్రిని నెక్కొండలో ఏర్పాటు చేయించాలని వారు కోరారు. నర్సంపేట పట్టణానికి దూరంగా ఉన్న నెక్కొండలో ఆసుపత్రి లేని కారణంగా ప్రజలకు వైద్య సేవలు అందడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట ఆసుపత్రిని నెక్కొండకు తరలించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, నాయకులు ఈదునూరి యాకయ్య, గాదె భద్రయ్య, కారింగుల సురేష్, బానోతు రవి, రావుల బాస్కర్‌రెడ్డి, తోట సాంబయ్య సత్యం, కుమారస్వామి, బోడ్డుపల్లి రాజు, శ్రీనివాస్, శ్రీనాథ్, జుట్టుకొండ వేణు, గడ్డం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం.. బల్దియా అప్రమత్తం..

(5వ పేజీ తరువాయి)

చెరువు వద్ద 30 మంది సిబ్బంది కలిసి మూడు షిఫ్టులలో ప్రత్యేక దుస్తులు ధరించి విధులు నిర్వర్తించారు. పెద్ద క్రేన్‌ల సహాయంతో గణపతి విగ్రహాలను చెరువులలో నిమజ్జనం చేశారు. చెరువుల వద్ద సిబ్బందికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు దగ్గరుండి పర్యవేక్షించారు. మధ్యాహ్నం నుంచి జరిగిన నిమజ్జన వేడుకలను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ సుధారాణి దగ్గరుండి పరిశీలించారు. చిన్నవడ్డెపల్లి చెరువులో జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని క్రేన్‌లో ఎక్కి పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు.

సిబ్బందికి ఏర్పాట్లు

నగరంలోని చెరువులు, కుంటల వద్ద విధులు నిర్వర్తిస్తున్న బల్దియా, పోలీసు, రెవెన్యూ, ఇంజనీరింగ్, మత్స్యశాఖతో పాటు అక్కడ పని చేయడానికి వచ్చిన దినసరి కూలీలకు బల్దియా పబ్లిక్ హెల్త్ విభాగం భోజన ఏర్పాటు చేసింది. సోమవారం మధ్యాహ్నం 4వేల మందికి రాత్రి 6వేల మంది సిబ్బందికి భోజనం అందించినట్టు శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ తెలిపారు. అంతేకాకుండా చెరువుల వద్ద సిబ్బందికి మంచి నీరు అందించారు. బల్దియా ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెరువుల చుట్టుపక్కల సీసీ కెమెరాల ఏర్పాటు చేసి బల్దియా కంట్రోల్ రూంకు అనుసంధానం చేసినట్టు ఎస్ఈ రాజయ్య తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరిగినా కెమెరాలలో రికార్డు అయ్యేందుకు ఐసీసీసీ విభాగం నుంచి ఐటీ సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్

గణేష్ మండపాల నుంచి నిమజ్జన ప్రదేశాలకు తరలించే సమయంలో వాహనాల నుంచి తొలగించిన వ్యర్థాలు, రోడ్లను శుభ్రం చేసేందుకు మంగళవారం శానిటేషన్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ చేయనున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలెపాక అనిల్‌కుమార్ తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందిని మినహాయించి స్టాండింగ్ సిబ్బందితో నగరంలోని రోడ్లు, కాలనీలు శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజులు పాటు చెరువులు వద్ద విధులు నిర్వర్తించి ప్రజలకు సహకరించిన బల్దియా సిబ్బందిని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి అభినందించారు. నిమజ్జన కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించి ఘనంగా సత్కరిస్తామని సీఎంహెచ్‌వో రాజేశ్ తెలిపారు.

భారీగా పోలీసు బందోబస్తు

(5వ పేజీ తరువాయి)

15 చెరువుల్లో పెద్దఎత్తున గణేష్ నిమజ్జనం జరిగింది. ఉదయం నుంచే నిమజ్జనం కోసం శోభాయాత్రలు నగరంలో ప్రారంభమయ్యాయి. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అడుగడుగునా పోలీసులు విధులు నిర్వహించారు. ఇద్దరు డీసీపీలతోపాటు 11మంది ఏసీపీలు ట్రైసిటీస్‌లో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఆయా నిమజ్జన ప్రదేశాల్లో సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు బందోబస్తు విధుల్లో ఉన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ట్రై సీటీస్ పరిధిలోని వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జన సమయంలో ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. 15 నిమజ్జన ప్రదేశాల్లో 135 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువు, వరంగల్ రంగశాయిపేటలోని బెస్తం చెరువు, హనుమకొండలోని సిద్ధేశ్వర గుండం, కాజీపేట పరిధిలోని బంధం చెరువుల్లో వినాయక విగ్రహాలను ఎక్కువ మొత్తంలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాల శోభాయాత్రతో ట్రైసిటీస్ పరిధిలోని రోడ్లు భక్త జనంతో నిండిపోయాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనాలు నగరంలోనికి రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. నగర పరిసర ప్రాంతాల్లో పోలీసులను ఏర్పాటు చేసి వాహనాలు నగరంలోని రాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు. మొత్తంగా వినాయక నిమజ్జన ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు.

బై.. బై.. గణేశా..

(5వ పేజీ తరువాయి)

అందించాలని మునిసిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున తరలివచ్చిన నగర వాసులు

దేశాయిపేట రోడ్‌లోని చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జన వేడుకలను వీక్షించేందుకు నగర వాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. భారీ విగ్రహాలను క్రేన్‌లతో నిమజ్జనం చేయడాన్ని ఆసక్తి తిలకించారు. నిమజ్జన ప్రాంతంలో వివిధ రకాల వస్తువుల అమ్మకాలు, డప్పు చప్పుళ్ల మధ్య వినాయక విగ్రహాల తరలింపులతో సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో జనాలు కిక్కిరిసిపోయారు. దీంతో ఆ ప్రాంతమంతా జాతర వాతవారణాన్ని తలపించింది.

40 ఫీట్ల మట్టి గణపతి

వరంగల్ ఎల్లంబజార్‌లోని భద్రకాళి హిందూ ఉత్సవ నిర్వహణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఖైరతాబాద్ వినాయకుడిని తలపించేలా ఎలాంటి రసాయనాలు వాడకుండా మట్టితో 40 ఫీట్ల ఎత్తుతో సుమారు రూ.30 లక్షలతో వినాయకుడిని తయారు చేయించారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ వినాయకుడిని ప్రతిష్ఠించడం జరిగిందని నిర్వాహకుడు ఆకుతోట సంజీవ్ తెలిపారు.

ఉత్సవాల ఖర్చు రూ.100 కోట్లపైనే..

ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయకులు మినహా వీధులు, జంక్షన్లలో, కాలనీలలో, వ్యాపార సముదాయాల్లో ప్రతిష్ఠించిన వినాయక నవరాత్రి ఉత్సవాల ఖర్చు ఈసారి అధికంగానే అయినట్లు తెలుస్తోంది. మండపాల అలంకరణ, నిత్యపూజలు, గణపతి విగ్రహాలకు, అన్నదానాలకు, డీజేలకు, లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలకు ఒక్కో వినాయక మండపానికి రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాల ఖర్చు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎంపిక

దుగ్గొండి, సెప్టెంబరు 16 : పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎంఏ. అజీజ్ ఎంపికైనట్లు సోమవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి వెల్లడించారు. లక్ష్మీపురం ఎంపీపీఎస్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్న పొలోజు భిక్షపతి ప్రధాన కార్యదర్శిగా, మండల అసోసియేట్ అధ్యక్షుడిగా వి.వీరన్న, మహిళా ఉపాధ్యక్షురాలిగా వి.పద్మశ్రీ, కార్యదర్శిగా భానుమూర్తి, మహిళా కార్యదర్శిగా విజయలక్ష్మి ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జీడబ్ల్యూ అధికార ప్రతినిధిగా జయరాజ్

పర్వతగిరి, సెప్టెంబరు 16 : నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) గ్రేటర్ వరంగల్ కమిటీ అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన గారె జయరాజ్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య నియామకపత్రాన్ని అందించారు. భద్రయ్య మాట్లాడుతూ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ బాధితులకు అండగా నిలబడడం కమిటీ నాయకుల ముఖ్యలక్షణమన్నారు. అవినీతి రహిత సమాజాన్ని నెలకొల్పడమే ఎన్‌హెచ్‌ఆర్‌సీ లక్ష్యమన్నారు.

అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడికి సన్మానం

పర్వతగిరి, సెప్టెంబరు 16 : పర్వతగిరి అంబేడ్కర్ సంఘం నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన జిల్లా శ్రీనివాస్‌ను సోమవారం పలువురు ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. సంఘం అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, సంఘం మాజీ మండల అధ్యక్షుడు జంగిలి భాస్కర్, మామిళ్ల చెన్నయ్య, మాదిగ ఐక్య సంక్షేమసంఘం మండల అధ్యక్షుడు బొట్ల భాస్కర్, నాయకులు బొట్ల కనకరాజు, చిన్నపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత లక్ష్మారెడ్డి మృతి



లక్ష్మారెడ్డి (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 16 : మండలంలోని దమ్మన్నపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అబ్బిడి లక్ష్మారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారంతెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామా నికి తీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావు, టీపీసీసీ లీగల్ సెల్ స్టేట్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్ రావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారుడు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దుబ్బతండాలో విషాదం



యాకూబ్ (ఫైల్)

వర్ధన్నపేట, సెప్టెంబర్ 16 : బతుకుదెరువు కోసం వలసవెళ్లి ఆత్మహత్యకు పాల్పడడంతో వర్ధన్నపేట పరిధి లోని దుబ్బతండాలో విషాదం నెలకొంది. దుబ్బతండాకు చెందిన భూక్యా యాకూబ్ బతుకు దెరువు కోసం హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో క్రిమి సంహారక మందు తాగి మృతి చెందడంతో తండాలో విషాదం నెలకొంది.

ఉరి వేసుకుని యువకుడు మృతి




నాగరాజు (ఫైల్)

రాయపర్తి, సెప్టెంబరు 16 : మానసిక పరిస్థితి బాగాలేక, జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొలన్‌పెల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొలన్‌పెల్లి గ్రామానికి చెందిన నాగండ్ల నాగరాజు(23) హైదరాబాద్‌లోని ప్రైవేటు ఉద్యోగంచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15న గ్రామానికి వచ్చిన నాగరాజు రాత్రి తన స్నేహితులతో గడిపి ఇంటికి తిరిగి వెళ్లాడు. కొంతకాలంగా మనస్థాపానికి గురవుతున్న నాగరాజు ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలిపారు. మృతునికి తల్లి యాకలక్ష్మిసోదరుడు రాజశేఖర్ ఉన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా

వర్ధన్నపేట, సెప్టెంబర్ 16 : పల్లెలు స్వచ్ఛతగా ఉంటే సామాజం బాగుంటుందని కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి ప్రతీ యేటా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతుంది. ఇందులో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని జీపీల్లో చేపట్టాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో ప్రధానంగా ఎన్జీవోలు, యువతకులు, మహిళా సంఘాలను భాగస్వాములను చేసి స్వచ్ఛతపై ర్యాలీలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేస్తారు. అక్టోబర్ 2న గ్రామ సభలు నిర్వహించి ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని తీర్మానాలుచేసి గ్రామస్థులకు బట్టసంచులు వినియోగించేలా అవగాహన కల్పిస్తారు. కాగా, స్వచ్ఛతా హీ సేవా విజయవంతానికి అన్ని విభాగాల అధికారుల కృషి అవసరమని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకట రమణ అన్నారు. అందరి కృషితోనే గ్రామాల రూపురేఖలు మారతాయని, అన్నివర్గాలు సహకరించాలని ఆమె కోరారు.

సబ్బు బిళ్లపై ప్రధాని మోదీ చిత్రం



నర్సంపేట, సెప్టెంబరు 16 : నర్సంపేట పట్టణానికి చెందిన కళాకారుడు గోకారామస్వామి చిన్న బ్లేడుముక్క సహాయంతో సబ్బు బిళ్లలపై అద్భుత కళాఖండాలు చిత్రించి పలువురి ప్రశంసలను అందుకుంటున్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రాన్ని సబ్బుబిళ్లపై చెక్కినట్లు కళాకారుడు గోకరామస్వామి తెలిపారు.